
సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



ఫుట్ వేర్‌కి బై.. ఫిట్ వాక్‌కి జై

బేర్ ఫుట్ వాకింగ్‌పై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. - 10లో



కాలం చెల్లిన మందులు..

కాలం చెల్లిన మందులు ఇచ్చారంటూ ఓ వ్యక్తి శనివారం తుర్కపల్లి పీహెచ్‌సీ ఎదుట నిరసనకు దిగాడు. - 10లో



ముగిసిన అటల్ ఎఫ్‌డీపీ

దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆరు రోజులుగా జరుగుతున్న ఎఫ్‌డీపీ ప్రోగ్రాం శనివారం ముగిసింది. - 11లో

న్యూస్‌రీల్

అత్యవసర సమయంలో 108కు కాల్ చేయాలి

భువనగిరి: దీపావళి పండుగ సందర్భంగా ఏవైనా ప్రమాదాలు సంభవించి అత్యవసర పరిస్థితి ఏర్పడితే 108 నంబర్‌కు కాల్ చేయాలని 108 ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ రాష్ట్ర కార్య నిర్వహణ అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాసులు కాల్చే క్రమంలో ప్రమాదాలు జరగడం, పొగకు శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు, అస్తమా, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంటాయన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

ఆలేరురూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. ఆలేరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. మార్కెట్‌కు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించిన రైతు కిష్టయ్యతో మాట్లాడి అధికారులు ఏమైనా ఇబ్బందులు పెట్టారా, కేంద్రంలో మౌలిక వసతులు ఏ విధంగా ఉన్నాయని ఆరా తీశారు. రైతులు ఎవ్వరూ ధాన్యాన్ని ప్రైవేట్‌కు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

హైవేపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం వాహనాల రద్దీ నెలకొంది. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జరిగిన బంద్ కారణంగా ఉదయం నుంచి మధ్యాహం వరకు వాహనాలు పెద్దగా బయటకు రాలేదు. మధ్యాహ్నం తరువాత రాకపోకలు మొదలయ్యాయి. దీపావళి పండుగతో పాటు వరుస సెలవులు ఉండడంతో ప్రజానీకం సొంతూళ్లకు బయలుదేరారు. ఈ క్రమంలో సాయంత్రం సమయంలో వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణంలో ఇరుమార్గాల్లో వాహనాలు పెద్ద సంఖ్యలో బారులుదీరాయి.

కోతుల బెడద నివారణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్ల గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కోతులను.. పట్టి తరలించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. కరీంనగర్ నంచి కోతులను పట్టే వాళ్లను పిలిపించారు. కోతికి రూ.300 చొప్పున చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకోసం ఇంటికి రూ.1000 చొప్పున ఇవ్వాలని గ్రామస్తులు శనివారం సమావేశమై తీర్మానించారు. గ్రామంలో సుమారు 500 ఇళ్ల వరకు ఉంటాయి. డబ్బులు వసూలు చేసే బాధ్యతలను కులసంఘాలకు అప్పగించారు.



బంద్ సందర్భంగా భువనగిరిలో మూసి ఉన్న దుకాణాలు



యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో నిలిచిపోయిన బస్సులు



నిర్మానుష్యంగా ఆలేరు బస్టాండ్

బీసీల బంద్ సక్సెస్

అన్ని రాజకీయ పార్టీలు, కుల, ప్రజాసంఘాల మద్దతు

- ఉదయం నుంచే రోడ్లపైకి వచ్చి నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు
- వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థల మూసివేత
- డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- ప్రైవేట్ వాహనాలు, రైళ్లను ఆశ్రయించిన ప్రయాణికులు
- జాతీయ రహదారులపై పోలీసుల మోహరింపు, సాఫీగా ప్రయాణం



భువనగిరిలో బీఆర్‌ఎస్ ర్యాలీ..



భువనగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు



ఆలేరులో ధర్నా చేస్తున్న అఖిలపక్షం, బీసీ ఐక్యవేదిక నాయకులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ‘బంద్ ఫర్ జస్టిస్’ పేరిట బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త బంద్ యాదాద్రి జిల్లాలో విజయవంతంగా ముగిసింది. ఉదయం నుంచే ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో సహా పలు కుల, ప్రజాసంఘాల నేతలు రోడ్లపైకి వచ్చి నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు చేపట్టారు. కాంగ్రెస్, బీజేపీలు కొన్ని చోట్ల వేర్వేరుగా, మరికొన్ని చోట్ల కలిసి బంద్‌లో పాల్గొన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోనుంచి బస్సులు మధ్యాహ్నం వరకు బయటకు రాలేదు.ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

- భువనగిరిలో సీపీఎం, సీపీఐలు కలిసి ర్యాలీ నిర్వహించాయి. బీసీ సంఘాలు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి రైతుబజార్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అంతకుముందు వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. భువనగిరి, యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఆలేరులో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు.
- వలిగొండలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు వేరువేరుగా ర్యాలీలు నిర్వహించగా.. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, బీసీ సంఘాల నాయకులు ఇతర రాజకీయ పార్టీలు కలిసి ర్యాలీలు తీశాయి.
- ఆలేరులో బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎం), న్యూ డెమాక్రసీ, బీసీ ఐక్యవేదిక, స్వచ్ఛంద సంస్థలు కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించాయి. ప్లకార్డులతో బైపాస్‌వద్ద, బస్టాండ్ బైఠాయించి నిరసన తెలిపారు.
- ఆలేరు మండలం కొలనుపాకలో అఖిలపక్షం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.
- భూదాన్‌పోచంపల్లి మండలంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐలు వేర్వేరుగా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాయి.
- బీబీనగర్‌లో కాంగ్రెస్, బీజేపీలు బీసీ సంఘాల నాయకులతో కలిసి వరంగల్– హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొండమడుగు వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.
- చౌటుప్పల్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు.
- యాదగిరిగుట్టలో బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు బంద్‌లో పాల్గొన్నాయి. బంధు కారణంగా యాదగిరి క్షేత్రానికి భక్తుల రద్దీ స్వల్పంగా ఉంది. రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.
- ఆత్మకూర్ (ఎం)లో బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.
- మోత్కూరులో బీసీ జేఏసీ, రామన్నపేటలో బీసీ సంఘాలు, అఖిలపక్ష నాయకులు కలిసి బంద్‌లో పాల్గొన్నారు.
- తుర్కపల్లిలో వేర్వేరుగా ధర్నాలు నిర్వహించారు. మాధాపూర్‌లో రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు.
- రాజాపేటలోని గాంధీసెంటర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.
- సంస్థాన్ నారాయణపురంలో బీసీ సంఘాలు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం చౌరస్తాలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

ప్రయాణికుల ఇక్కట్లు

బంద్ వల్ల భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ బస్టాండ్లు నిర్మానుష్యంగా మారాయి. బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ప్రైవేట్ వాహనాలు, రైళ్లను ఆశ్రయించారు. ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీ వసూలు చేసినట్లు ప్రయాణికులు వాపోయారు. జాతీయ రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్, సివిల్ పోలీసులను మోహరించారు.

50 శాతం దాటొద్దని ఎక్కడుంది?

సాక్షి, యాదాద్రి : బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దని రాజ్యాంగంలో ఎక్కడుందని, ఇది నిజం కాదని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. అన్ని పార్టీలను ఒక్కటి చేసి కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పెడితే కొందరు కుట్రపూరితంగా నోటి కాడి బుక్కను గుంజుకుంటున్నారని విమర్శించారు. బంద్‌లో భాగంగా భువనగిరిలోని జగ్జీవన్‌రాం చౌరస్తాలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో తీర్మానం చేసి పంపిన బిల్లును గవర్నర్, రాష్ట్రపతి పెండింగ్‌లో పెట్టి నానుస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీలు, నాయకులు కేంద్రంపై ఎందుకు వత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు. రిజర్వేషన్లు ఎవరు ఇచ్చే భిక్ష కాదని, బీసీల హక్కు అన్నారు. వెయ్యి మంది బీసీలను ఢిల్లీకి తరలించి అక్కడ ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, పోత్నక్‌ప్రమోద్‌కుమార్, అవైస్ చిస్తీ, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, ఎండీ ఇమ్రాన్, కొత్త నర్సింహస్వామి, భట్టు రామచంద్రయ్య, ఎండీ అతహర్, ఎండీ రఫీ, కస్తూరిపాండు, సాబన్‌కార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీర్ల ఐలయ్య, చిత్రంలో బండ్రు శోభారాణి, ఉట్కూరి అశోక్‌గౌడ్, నాయకులు

విధేయత, కష్టపడే వారికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్, చిత్రంలో ప్రభుత్వ విప్ ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బండ్రు శోభారాణి, జనగాం ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు

- ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్

యాదగిరిగుట్ట రూరల్: పార్టీ కోసం కష్టపడి, సమన్వయంతో ముందుకు వెళ్లే వారికే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి దక్కుతుందని ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్ పేర్కొన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక అన్ని డివిజన్లలోని కాంగ్రెస్ నాయకుల సలహాలు, సూచనల మేరకు పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎవరైతే బాధ్యతగా పనులు చేస్తూ, విధేయుడిగా పార్టీని నడిపిస్తున్నారో వారిని మాత్రమే పరిగణలోనికి తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆరుగురి పేర్లను ఎంపిక చేసి ఏఐసీసీకి పంపిస్తామని చెప్పారు. ఇందులో ఒకరిని హైకమాండ్ ఎంపిక చేస్తుందని తెలిపారు. అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ, పేర్ల పరిశీలన ఈ నెల 21 వరకు జరుగుతుందని, తదనంతరం ఫైనల్ రిపోర్టును అధిష్టానానికి పంపిస్తామన్నారు. పార్టీలో ఐదేళ్ల కన్నా ఎక్కువ పనిచేసి ఉండాలని, పార్టీ కోసం శ్రమించే వారికి డీసీసీ పదవి దక్కుతుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వడానికి మేము సపోర్ట్ చేస్తామన్నారు.

అందరి అభిప్రాయం మేరకే ఎన్నిక : ఐలయ్య

పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకే జిల్లా అధ్యక్షుని ఎంపిక ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గతంలో మాదిరిగా సిఫారసు లేఖలతో కాకుండా, పార్టీ నాయకుల అభిప్రాయాలను హైకమాండ్ పరిగణలోకి తీసుకుంటుందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు ఎవరైనా పోటీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసారపు యాదగిరిగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆబ్కారీ అంచనాలు తలకిందులు

- మద్యం టెండర్లకు తగ్గిన స్పందన
- 82 షాప్‌లకు 2,647 దరఖాస్తులు
- గత ఏడాదితో పోల్చితే 1,253 తక్కువ



భువనగిరిలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద దరఖాస్తు దారులు

భువనగిరి: నూతన మద్యం దుకాణాల టెండర్లకు ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోటీ తీవ్రంగా ఉంటుందని, దరఖాస్తు ఫీజు రూపంలో భారీగా ఆదాయం సమకూరుతుందని ఆశించిన ఎక్సైజ్ శాఖ అంచనాలు తలకిందులయ్యాయి. గత ఏడాది 3,900 దరఖాస్తులు రాగా ఈసారి కేవలం 2,541 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గత సంవత్సరంతో పోలిస్తే 1,253 దరఖాస్తులు తగ్గాయి. కాగా 2025–27 సంవత్సరానికి గాను నూతన మద్యం దుకాణాల నిర్వహణకు ఎక్సైజ్‌శాఖ సెప్టెంబర్ 26న ప్రకటన జారీ చేసింది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా.. శనివారం సాయంత్రం గడువు ముగిసింది.

గతసారి రూ.78.50 కోట్ల ఆదాయం

జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 82 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2023–24 సంవత్సరంలో 3,900 దరఖాస్తులు రాగా.. వీటి ద్వారా రూ.78.50 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి 2,541 దరఖాస్తులు దాఖలు కాగా రూ.79.41 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఎల్లంబావి వైన్స్‌కు 88 దరఖాస్తులు

అత్యధికంగా చౌటుప్పల్ మండలంలోని ఎల్లంబావి గ్రామ వైన్స్‌కు 88 దరఖాస్తులు వచ్చాయి. ఆ తరువాత మోత్కూరు సర్కిల్ పరిధిలోని అరూర్ వైన్స్‌కు 80, అత్యల్పంగా తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ షాప్‌కు 14 దరఖాస్తులు వచ్చాయి.

23న డ్రా ద్వారా దుకాణాల కేటాయింపు

రాయగిరి పరిధిలోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 23న కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి దుకాణాలు కేటాయించనున్నారు.

దరఖాస్తులు తగ్గడానికి కారణం ఇదేనా?

2023–24లో ఫీజు రూ.2లక్షలు ఉండగా.. ఈసారి రూ.3 లక్షలకు పెంచారు.ఆసక్తి చూపకపోవడానికి ఇదే కారణమని అధికారులు భావిస్తున్నారు.

నృసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు ప్రధానాలయంలోని స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపారు. ఆ తర్వాత గర్భాలయంలోని స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు తులసీదళాలతో అర్చించారు. ఇక ముఖమండపంలోని అలంకారమూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవ మూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. సాయంత్రం వెండి జోడు సేవను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు.



ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జువైనల్ జస్టిస్ బోర్డుతో సత్వర న్యాయం



జువైనల్ జస్టిస్ బోర్డు ప్రారంభోత్సవంలో ప్రధాన జడ్జి జయరాజు, న్యాయమూర్తులు తదితరులు

- జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

భువనగిరిటౌన్ : జువైనల్ జస్టిస్ బోర్డు వల్ల బాల నేరస్తులకు సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు అన్నారు. భువనగిరి కోర్టులో ఏర్పాటు చేసిన జువైనల్ జస్టిస్ బోర్డును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బోర్డు ద్వారా కేసుల విచారణ వేగంగా జరుగుతుందన్నారు. బాల నేరస్తులకు శిక్ష విధించడం కాకుండా సత్ప్రవర్తనతో సమాజంలోకి వెళ్లేలా చూస్తామని తెలిపారు. పునరావాసం, ఉపాధి శిక్షణ లభిస్తుందన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డు ఇంచార్జ్ న్యాయమూర్తిగా భువనగిరి జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి స్వాతి బాధ్యతలు స్వీకరించారు. కాగా మొదటి రోజు 10 కేసులను విచారించినట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో న్యాయమూర్తులు, ముక్తిద, మాధవిలత, ఉషశ్రీ, శ్యాంసుందర్, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బోర్డు ఇంచార్జ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జడ్జి స్వాతి

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, చిత్రంలో రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి

రామగిరి(నల్లగొండ) : ఆర్టీసీ దసరా స్పెషల్ లక్కీ డ్రాలో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. నల్లగొండ డిపోలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి విజేతలకు నగదు చెక్‌లను అందజేశారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు డీలక్స్, సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణించి డ్రా బాక్స్‌లో వేసిన టికెట్‌లను శనివారం లక్కీ డ్రా తీసి ముగ్గురిని ఎంపిక చేశారు. మొదటి బహుమతి వై.రాము (రూ.25 వేలు), ద్వితీయ అనసూర్య (రూ.15 వేలు), మూడవ బహుమతి తోటపల్లి బాలమణి (రూ.10 వేలు) గెలుచుకున్నారు. ప్రయాణికులను ప్రోత్సహించేందుకు లక్కీ డ్రా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం జానిరెడ్డి, డిప్యూటీ డీఎం సుచరిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాదగిరీశుడిని దర్శించుకున్న పీవీ సింధు



పీవీ సింధుకు వేదాశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకుడు

యాదగిరిగుట్ట రూరల్: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలంపిక్ పతక విజేత పీవీ సింధు శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని పీవీ సింధుకు ఆలయ అధికారులు అందజేశారు.

సాగర్‌ను సందర్శించిన ఏపీ గవర్నర్

నాగార్జునసాగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నాగార్జునసాగర్‌కు వచ్చారు. ఆయనకు విజయవిహార్ అతిథిగృహం వద్ద నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం భోజనం అనంతరం ప్రత్యేక లాంచీలో ఆయన నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలోగల బౌద్ధ శిల్పాలు, బోధివృక్షం, అలనాటి నాగరికత విశేషాలను తెలుసుకున్నారు. సాయంత్రం విజయవిహార్ అతిథిగృహానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం స్థానికంగా మరికొన్ని సందర్శనీయ స్థలాలకు చూస్తారు. సాయంత్ర తిరిగి అమరావతికి వెళ్లనున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఏఎన్ఎం దుర్మరణం



సుజాత (ఫైల్)

వలిగొండ: స్కూటీపై వెళ్తున్న ఏఎన్ ఎంను ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందింది. ఈ ఘటన వలిగొండ మండలం వర్కట్‌పల్లిలో శని వారం జరిగింది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రానికి చెందిన పోలేపాక(దేవరాయ) సుజాత (43) వర్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తోంది. శనివారం సాయంత్రం పీహెచ్‌సీలో విధులు ముగించుకొని తన కుమారుడిని తీసుకొని స్కూటీపై ఇంటికి తిరిగి వస్తుండగా.. పీహెచ్‌సీ సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత తలపై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె కుమారుడికి కాలు విరిగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

ఫుట్ వేర్‌కి బై.. ఫీట్ వాక్‌కి జై..

సండే స్పెషల్

పాదరక్షలు లేకుండా వాకింగ్ చేయడంపై పెరుగుతున్న ఆసక్తి

- ఎర్తింగ్, గ్రౌండింగ్ వంటి పేర్లతో కాలినడక
- ఆరోగ్య లాభాలు ఉన్నాయంటున్న నిపుణులు

వాకింగ్ చేయడం ఆరోగ్యానికి చాలా మంచిది. అందులోనూ ఉదయం వాకింగ్ చేస్తే బరువు తగ్గడంతో పాటు అనేక ఆరోగ్యపరమైన లాభాలు కలుగుతాయి. అయితే చాలా వరకు షూ, చెప్పులు వేసుకుని వాకింగ్ చేస్తారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చెప్పులు లేనిదే అడుగు బయటకు వేయలేని పరిస్థితి. కానీ ఇటీవలి కాలంలో చెప్పులు లేకుండా వాకింగ్ (బేర్ ఫుట్ వాకింగ్) చేయడంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇది ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎర్తింగ్, గ్రౌండింగ్ పేర్లతో పాదరక్షలు లేకుండా నడిచేవారి సంఖ్య పట్టణాల్లో రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్య రక్షణపై పెరుగుతున్న అవగాహనే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు.



నల్లగొండ పట్టణంలోని పంచతత్వ పార్కులో పాదరక్షలు లేకుండా నడుస్తున్న వాకర్స్

రామగిరి(నల్లగొండ): కాళ్లకు చెప్పులు లేకుండా నడవడం ఒకప్పటి తరంలో ఉండేది. మన తాతలు, ముత్తాతల కాలంలో సరైన రవాణా సౌకర్యాలు లేనందున కొన్ని మైళ్ల దూరం వారు చెప్పులు లేకుండా నడిచేవారని విన్నాం. అలా నడవడం వారికి ఎంతో దోహదం చేసిందని చెప్పుకోవచ్చు. పాదరక్షలు లేకుండా నడవడం వల్ల స్టిములేషన్ జరిగి ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. వాకింగ్ చేయడంలో విభిన్న మార్గాలు ఉన్నాయి. వాటిలో గ్రౌండింగ్ లేదా ఎర్తింగ్ కూడా ఒకటి. చెప్పులు లేకుండా పచ్చ గడ్డి మీద నడవడమే గ్రౌండింగ్. మరి చెప్పులు లేకుండా పచ్చగడ్డి మీద నడవడం ఆరోగ్యానికి మంచిదేనా? దీని వలన కలిగే బెనిఫిట్స్ ఏంటి? మరి పచ్చగడ్డి మీద నడవడంపై వైద్య శాస్త్రం ఏం చెబుతుంది అనే విషయాలను తెలుసుకుందాం.

బేర్ ఫుట్ వాకింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు

పాదరక్షలు లేకుండా నడవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. శరీరానికి, కాళ్లకు మధ్య సమన్వయం, మెరుగైన రక్తప్రసరణ జరుగుతుంది. కాలివేళ్లతో పాటు అడుగు భాగంలో ప్రెజర్ పాయింట్లు ఉంటాయి. చెప్పులు లేకుండా నడవడం వల్ల ప్రెజర్ పాయింట్లలో స్టిములేషన్ జరుగుతుంది. వాటికి అనుసంధానమై ఉన్న అవయవాలు యాక్టివేట్ అవుతాయి. దీంతో దేహంలో జరగాలిన్సన క్రియలు సక్రమంగా జరుగుతాయి. అంతేకాకుండా భూఉపరితలానికి, దేహానికి ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. రోజు కూర్చొని పనిచేసే వారికి బేర్ ఫుట్ వాకింగ్ మేలు చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతస్రావిక గ్రంథులు సక్రమంగా పనిచేసి హార్మోన్లు విడుదలవుతాయి. పాదాలు నేరుగా నేలను తాకడం వల్ల మెదడు చురుకుగా మారుతుంది. అంతేకాకుండా స్పర్శ జ్ఞానం మెరుగుపడుతుందని, జ్ఞాన, చాలక నాడులు స్టిములేషన్ జరుగుతుందని, దేహం బ్యాలెన్సింగ్ వంటి పెరుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. షూ, సాక్స్ వాడడం వల్ల బ్యాక్టీరియా, ఫంగస్ నుంచి ఆరోగ్యానికి హాని కలగవచ్చు.



నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో బేర్ ఫుట్ వాకింగ్ చేస్తున్న వాకర్స్

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- మట్టిలోని గాజు ముక్కలు, కంకర, ఇనుప వస్తువుల వల్ల పాదాలకు గాయాలయ్యే ప్రమాదం ఉంది.
- షుగర్ పేషెంట్లు, సున్నితమైన స్కిన్, స్కిన్ ఎలర్జీ, ఇతర పాద సమస్యలు ఉన్నవారు బేర్ ఫుట్ వాకింక్ చేయకూడదు.
- సీసీ రోడ్లు, బీటీ రోడ్లు బేర్ ఫుట్ వాకింకగ్‌కు అనువు కాదు. మట్టి నేలపై మాత్రమే చేయాలి.
- ఇంటి వద్ద సురక్షితమైన పార్కులలో చేయడం మంచిది.
- అపరిశుభ్ర ప్రదేశాల్లో పాదరక్షలు లేకుండా వాకింగ్ చేయడం వల్ల అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది.
- ఉష్ణోగ్రత తీవ్రంగా ఉన్నపుడు చెప్పులు లేకండా నడవడం ప్రమాదకరం.
- వృద్ధులు, ఆర్థరైటిస్ సమస్యలు ఉన్న వారికి ఫంగల్ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంది.
- పీడియాట్రిషన్, ఫిజియోథెరపిస్ట్ సలహాలు పాటిస్తే మంచిది.

సురక్షిత ప్రాంతాల్లో చేయాలి



సురక్షితమైన ప్రాంతాల్లో బేర్ ఫుట్ వాకింగ్ చేస్తే మంచిది. అపరిశుభ్రంగా ఉన్న చోట చెప్పులు లేకుండా వాకింగ్ చేయడం మంచిది కాదు. కాలి ద్వారా అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది. షుగర్ వ్యాధి ఉన్నవారు కాలినడకన వాకింగ్ చేయకూడదు.

– నారాయణరెడ్డి, వాకర్, నల్లగొండ



అనేక లాభాలు ఉన్నాయి



పాదరక్షలు లేకుండా బేర్ ఫుట్‌తో వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్య పరంగా అనేక లాభాలు చేకూరుతాయి. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, జీర్ణ సంబంధమైన క్రియలు సక్రమంగా పనిచేస్తాయి. మహిళలకు బ్లాడర్, హార్మోన్ల సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. అదేవిధంగా చర్మ సమస్యలు, షుగర్ వ్యాధి ఉన్నవారు బేర్ ఫుట్ వాకింగ్ చేయకూడదు.

– డాక్టర్ పద్మ, ఎండీ, ఆక్యుపంక్చర్

ఒత్తిడి దూరమవుతుంది



బేర్ ఫుట్ వాకింగ్ వలన భూమి నుంచి అందే ప్రెజర్ దేహం మొత్తానికి అందుతుంది. మట్టిలో అనేక పోషకాలు ఉంటాయి. అవన్నీ దేహానికి చేరుతాయి. అధిక ఒత్తిడి దూరమవుతుంది. అరికాళ్లలో దేహంలోని అవయవాలకు చెందిన పాయింట్లు ఉంటాయి అవన్నీ యాక్టివేట్ అవుతాయి. మట్టిపై కాకుండా ఇతర ప్రదేశాల్లో నడిస్తే మోకాళ్ల నొప్పులు వస్తాయి. ఆరోగ్యవంతులు చెప్పులు లేకుండా నడిస్తేనే మంచిది.

– కరుణాకర్, యోగా గురువు

పుస్తెలతాడు చోరీకి యత్నం.. దొంగకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- దాసరిగూడెం శివారులో ఘటన



దొంగను పోలీసులకు అప్పగిస్తున్న దాసరిగూడెం గ్రామస్తులు

నార్కట్‌పల్లి: పత్తి చేను వద్దకు వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని యువకుడు అపహరించేందుకు యత్నించగా గ్రామస్తులు అతడిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పజెప్పారు. ఈ ఘటన శనివారం నార్కట్‌పల్లి మండలం దాసరిగూడెం గ్రామ శివారులో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరిగూడెం గ్రామానికి చెందిన ఉప్పల సునీత శనివారం ఉదయం 11గంటల సమయంలో తమ పత్తి చేను వద్దకు వెళ్తోంది. అదే సమయంలో అటుగా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు బైక్‌ను కొద్దిదూరంలో ఆపి సునీత వద్దకు నడుచుకుంటూ వచ్చాడు. ఇక్కడ గుంట తంగడి ఆకు దొరుకుతదా అంటూ మాటల్లో పెట్టి ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కొని పారిపోబోయాడు. సునీత అతడితో పెనుగులాడి కేకలు వేయడంతో అటుగా కారులో వెళ్తున్న వారు వచ్చి దొంగను పట్టుకున్నారు. గ్రామస్తులకు సమాచారం తెలియడంతో దొంగను చితకబాది పోలీసులకు సమాచారం ఇచ్చారు. నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దొంగను అరెస్ట్ చేశారు.

కాలం చెల్లిన మందులిచ్చారని పీహెచ్‌సీ ఎదుట నిరసన



పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితుడు అంజయ్య

తుర్కపల్లి: కాలం చెల్లిన మందులు ఇచ్చారంటూ ఓ రోగి శనివారం సాయంత్రం తుర్కపల్లి పీహెచ్‌సీ ఎదుట నిరసనకు దిగాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన తొలిచుక్క అంజయ్య కాలుకు మూడు రోజుల క్రితం ఇనుప చువ్వ గుచ్చుకోగా.. చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి వచ్చాడు. పీహెచ్‌సీ డాక్టర్ రుచిరారెడ్డి సూచన మేరకు స్టాఫ్ నర్సు రజిత అంజయ్యకు ఇంజెక్షన్‌తో పాటు మందులు ఇచ్చింది. ఇంటికి వెళ్లిన అనంతరం అంజయ్య కాలుకు ఇన్‌ఫెక్షన్ కావడం, తీవ్ర నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మందులను చూడగా కాలం చెల్లినట్లు గుర్తించారు. దీంతో అంజయ్య శనివారం సాయంత్రం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేపట్టాడు. ఈ ఘటనపై డాక్టర్ రుచిరారెడ్డి స్పందిస్తూ.. స్టాఫ్ నర్సు రజిత, ఫార్మసిస్ట్ మహేశ్వరిపై విచారణ జరిగి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓకు నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు.

శివలీలారెడ్డికి జాతీయ సేవా పురస్కారం



శివలీలా రెడ్డి

కనగల్ : మండల కేంద్రానికి చెందిన డాక్టర్ కంబాల శివలీలారెడ్డికి విశ్వమాత మదర్ థెరిసా జాతీయ పురస్కారం ప్రకటించారు. హెల్ప్ ఫౌండేషన్ 4వ వార్షికోత్సవ సందర్భంగా తన సేవలను గుర్తించి ఈ పురస్కారం లభించినట్లు శివలీలారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 26న పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

నిత్యం పర్యవేక్షిస్తాం



రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

మునుగోడు: రైస్ మిల్లుల యజమానులు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం తీసుకొని తిరిగి సీఎంఆర్‌కు అప్పగించేంత వరకు నిత్యం పరివేక్షిస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. శనివారం ఆయన మునుగోడులోని రైస్ మిల్లులను ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా కట్టడిచేసేందుకు తనఖీలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

జలనారాయణ స్వామికి మంగళహారతులు



జలనారాయణ స్వామికి మంగళహారతులు సమర్పిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శని వారం జలనారాయణ స్వామికి మంగళహారతులు సమర్పించారు. అదేవిధంగా ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నదానం, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి పంచామృతాభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలో శ్రీఇష్ట కామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం బహుళ త్రయోదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన, మహానివేదన, మంగళనిరాజనం అనంతరం తీర్థప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం ప్రదోష సమయంలో నందీశ్వరుడికి పంచామృతాభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ఎస్.శంభిరెడ్డి, ఆలయ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, సిబ్బంది కొండారెడ్డి, నర్సింహారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య



స్వామి గౌడ్ (ఫైల్)

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం చౌటుప్పల్ పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని రత్నానగర్‌కాలనీలో నివాసముంటున్న పల్లె స్వామిగౌడ్(49)కు భార్య సుశీల, కుమార్తె అఖిల ఉన్నారు. అతడు చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగోజిగూడెం గ్రామంలోని ఓ పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య లక్కారం శివారులోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తోంది. ఇటీవల వారి కుమార్తె వివాహం జరిగింది. స్వామిగౌడ్ పెట్రోల్ బంక్‌లో పనిచేయడంతో పాటు ఫైనాన్స్ వ్యాపారం కూడా నిర్వహిస్తుంటాడు. ప్రతి రోజు సాయంత్రం 6గంటల సమయంలో తన భార్య డ్యూటీ ముగించుకొని ఇంటికి వస్తుంది. ఈ క్రమంలో బస్టాండ్ వద్దకు వెళ్లి ఆమెను బైక్‌పై ఇంటికి తీసుకొస్తుంటాడు. శనివారం సాయంత్రం కూడా స్వామిగౌడ్‌కు అతడి భార్య ఫోన్ చేయగా.. అతడు లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె నడుచుకుంటూనే ఇంటికి చేరుకుంది. తలుపులు దగ్గరకు వేసి ఉండడంతో నెట్టుకొని లోపలికి వెళ్లగా.. స్వామిగౌడ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

18 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం

ఇంట్లో స్వామిగౌడ్ రాసిన 18 పేజీల సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన బంధువులకు, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి, సొంత అల్లుడికి, స్థానికంగా తనతో అనుబంధం కలిగిన 18మంది రాజకీయ నాయకులకు, క్లాస్‌మేట్స్‌కు వేర్వేరుగా స్వామిగౌడ్ సూసైడ్ నోట్ రాశాడు. అందులో 'నాకు అప్పులు అయ్యాయి. ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ఈ అప్పులతో ఇబ్బంది పడుతున్న విషయం ఇంట్లో కూడా తెలియదు. తెలిస్తే ముందుగా నా భార్య చనిపోతుంది. అందుకే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. నాకు సొంత ఇల్లు కూడా లేదు. నాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు. నా కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు ఆదుకోవాలి. మనం ఇన్ని సంవత్సరాలు కలిసిమెలిసి ఉన్నాం, కావున ఇకపై మీరంతా నా కుటుంబానికి అండగా నిలవాలి' అని క్లాస్‌మేట్స్‌కు విజ్ఞప్తి చేశాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధిక వడ్డీ దందా.. గుండెపోటుతో యువకుడి మృతి



నరేష్ (ఫైల్)

చందంపేట: అధిక వడ్డీ దందా ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన పలువురు అధిక వడ్డీ చెల్లిస్తామంటూ నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోల్య నాయక్ తండాలో కొంతమంది దగ్గర డబ్బులు తీసుకున్నారు. అనుకున్న ప్రకారమే మొదట్లో అధిక వడ్డీ ఇస్తుండడంతో మరికొందరు వారికి డబ్బులు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇలా గ్రామానికి చెందిన సుమారు పదిహేను మంది నుంచి రూ.2కోట్ల వరకు వసూలు చేశారు. అదే గ్రామానికి చెందిన ఇస్లావత్ నాత్య కుమారుడు ఇస్లావత్ నరేష్(30) కుటుంబంతో పాటు హైదరాబాద్‌లో నివాసముంటూ శుభకార్యాలలో వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నరేష్ కూడా రూ.9లక్షల వరకు అప్పు తెచ్చి వారికి వడ్డీకి ఇచ్చాడు. మొదట్లో అనుకున్న మేరకు అధిక వడ్డీ చేతికి అందగా.. ఆ ఆతర్వాత సరైన స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన నరేష్ వారిని గట్టిగా నిలదీశాడు. దీంతో రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు. దీంతో నరేష్‌కు అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనోవేదనకు గురై శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



బాధితురాలికి ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న పోలీసులు, ఆటో డ్రైవర్

నల్లగొండ: ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి శనివారం ఆటోలో మిర్యాలగూడకు బయల్దేరిన నెమ్మాని సంధ్య తన గమ్యస్థానం రాగానే ఆటోలో ల్యాప్‌టాప్, రూ.1500 నగదు మర్చిపోయి వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ ఎండీ లతీఫ్ బ్యాగును గమనించి నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో వాటిని అప్పగించాడు. పోలీసులు విచారణ చేసి సంధ్యను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఆమెకు ల్యాప్‌టాప్, రూ.1500 నగదు అప్పగించి ఆటో డ్రైవర్ లతీఫ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ వైర్లు చోరీ

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లి గ్రామ పరిధిలోని పిలాయిపల్లి కాలువ వెంట 30 మంది రైతులకు విద్యుత్ మోటార్లకు అమర్చిన కరెంట్ వైర్లలోని కాపర్ వైరును శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. చోరీకి గురైన వైరు విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధిత రైతు బొబ్బల బాలకృష్ణారెడ్డి తెలిపారు. దుండగులు రాత్రి పిలాయిపల్లి కాలువ పక్కన మద్యం తాగి ఖాళీ సీసాలు పడేసి వెళ్లారు. గడిచిన ఏడాది కాలంలో ఇప్పటికీ నాలుగైదు సార్లు కరెంట్ వైర్లను ఎత్తుకెళ్లారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గంజాయి పీలుస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

నకిరేకల్: గంజాయి పీలుస్తున్న ఇద్దరు యువకులను నకిరేకల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన ఓ యువకుడు, శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ పంచాయతీకి చెందిన మరో యువకుడు కలిసి నకిరేకల్‌లో పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. వారు గంజాయి పీలుస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. వారిద్దరిని చిట్యాలలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపించామని సీఐ వెంకటేష్ తెలిపారు.